క్లుప్తంగా

రచయితకు సన్మానం



కొప్పుల ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నాగుండె సవ్వడి పుస్తక రచయిత కొప్పుల ప్రసాద్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని బాలఅకాడమీ పాఠశాలలో ఐఎంఏ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మదుసూదన్‌రావు, రవికృష్ణ, సెక్రటరీ అనిల్‌కుమార్ మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో భాగంగా నంద్యాలకు చెందిన ప్రముఖ రచయిత కొప్పులప్రసాద్ రచించిన నాగుండె సవ్వడి పుస్తకాన్ని పరిచయం చేశారు. కార్యక్రమంలో సురేంద్రనాథ్‌రెడ్డి, కొండయ్య, రవీంద్రనాథ్ పాల్గన్నారు.

శోభన్‌బాబు జయంతి



శోభన్‌బాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

నంద్యాల(అర్బన్): దివంగత సినీనటుడు శోభన్‌బాబు 89వ జయంతిని అభిమానులు స్థానిక పరివర్తన లైఫ్ సెంటర్‌లో నిర్వహించారు. శోభన్‌బాబు సేవాసమితి అధ్యక్షుడు చింతలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు. అన్నయ్య, జానకిరాముడు, వాసు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

తెలుగు భాషోద్యమ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్

నంద్యాల (వ్యవసాయం): తెలుగుజాతిని జాగృతం చేస్తూ భాషోద్యమానికి ఊపిరి పోస్తున్న 'అప్పుడు రాష్ట్రం కోసం ఇప్పుడు భాష కోసం.. ఎప్పుడూ పోరాటమే 'అనే పుస్తకానికి సంబంధించి పరిచయ సభ, తెలుగు భాషోద్యమ కార్యాచరణపై చర్చా కార్యక్రమాన్ని నంద్యాలలో నందిరైతు సమాఖ్య కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు తన పుస్తకాల ద్వారా తెలుగు వారిలో భాషోద్యమ స్ఫూర్తిని పెంపొందించడం అభినందనీయమన్నారు. ముఖ్యఅతిథి పుస్తక రచయిత డాక్టర్ దోనెపూడి నరేష్ బాబు మాట్లాడుతూ తెలుగు భాష ఉనికికి ప్రమాదం ఏర్పడుతున్న ఈ రోజుల్లో ముక్తేశ్వరరావు గారు రచించిన భాషోద్యమ పుస్తకాలు తెలుగు భాష ఉనికిని కాపాడుకోవడానికి దోహదపడతాయన్నారు. అనంతరం కవులు, రచయితలు ×భాష కోసం పోరాటం్జ అనే పుస్తకాన్ని పునః ఆవిష్కరించారు. ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయ విశ్రాంత డిప్యూటీ రిజిస్ట్రార్ డీవీఎస్ శాస్త్రి, రచయితలు శ్రీనివాసమూర్తి, , శ్రీనివాసరెడ్డి, నీలం వెంకటేశ్వలు, రఫీ, డాక్టర్ కిషోర్ కుమార్, కొప్పుల ప్రసాద్, నీలకంఠమాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఉయ్యాలవాడ : ఇంజేడు గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి మోటార్ సైకిల్‌పై వెళ్తూ అదుపు తప్పి కింద పడిన సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. రుద్రవరం మండలం పెద్దకంబలూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, ఆయన కుమారుడు రామచంద్రుడు మోటార్ సైకిల్‌పై సంజామల మండలం పేరుసోములకు బయలుదేరారు. రోడ్డు ప్రమాదంలో వీరికి తీవ్ర గాయాలు కాగా, 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం నంద్యాల ఆసుపత్రికి తరలించినట్లు వాహన పైలెట్లు మురళి, రాజారెడ్డి తెలిపారు.

నిధుల మంజూరు

ఉయ్యాలవాడ : స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహం మరమ్మతుల నిమిత్తం రూ. 29.25 లక్షలు మంజూరైనట్లు పంచాయతీ రాజ్ ఏఈ వెంకటయ్య బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ భవనంలో పనులను త్వరలో చేపట్టనున్నట్లు వెల్లడించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి బలవన్మరణం

అవుకు: వేర్వేరు చోట్ల ముగ్గురు వ్యక్తులు పేడరంగు సేవించి మృతి చెందారని పోలీసులు తెలిపారు. రామాపురం గ్రామానికి చెందిన కావలి లక్ష్మన్న(35) మద్యానికి బానిసై కుటుంబంతో గొడవపడి పేడరంగు సేవించి మృతి చెందాడని భార్య కావలి నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. రామాపురం గ్రామంలో చాకలి అనసూయమ్మ(57) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పేడరంగు సేవించి మృతి చెందింది. వేముల పాడు గ్రామానికి చెందిన మద్దూరి సుజాత (61) అనారోగ్య సమస్యలతో బాధపడతూ పేడరంగు సేవించి మృతి చెందింది. మృతిరాలి తమ్ముడు దిలీప్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

భక్తుడి చెంతకు నారసింహుడు

- పార్వేట ఉత్సవాలకు శ్రీకారం
- శాస్త్రోక్తంగా అహోబిలేశుడి ఉత్సవ పల్లకీని సాగనంపిన భక్త జనం



అన్నకూటోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



అహోబిలం నుంచి పార్వేటకు బయలుదేరిన అహోబిలేశుడు



ఉత్సవాలను పర్యవేక్షిస్తున్న జిల్లా ఎస్పీ

ఆళ్లగడ్డ: నల్లమల అడవుల్లో వెలసిన అహోబిలేశుడు భక్తుల చెంతకు బయలు దేరారు. తమ కల్యాణ వేడుకకు రమ్మని స్వయంగా భక్తులను ఆహ్వానించేందుకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి కొండదిగి గ్రామాలకు బయలుదేరారు. సంక్రాంతి పండుగ ముగిసిన మరుసటి రోజు (కనుమ) పారువేట ఉత్సవాలు ప్రారంభించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఎగువ అహోబిలంలో వెలసిన శ్రీ జ్వాలా నృసింహస్వామి మంగళవారం దిగువ అహోబిలం తోడ్కొని వచ్చి అక్కడ వెలసిన ప్రహ్లాదవరద స్వామితో కలిపి ప్రత్యేకంగా అలంకరించిన యాగశాలలో కొలువుంచారు. ఇరువురికీ తలపాగా చుట్టి వేటగాల్లలా అలంకరించారు. గావించి పార్వేట జరుగనున్న 46 రోజులు 33 గ్రామాల పరిధిలో స్వామి వెంట నడిచే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ప్రత్యేక పార్వేట పూజలు జరిపించారు.

ప్రత్యేక పూజలు..

ప్రహ్లాదవరదుడు, జ్వాలా నరసింహ స్వాముల సమక్షంలో కుంభహారతి అనంతరం అన్నకూటోత్సవం (46 రోజులు స్వామికి అవసరమైన ఆహారం) అర్పించారు. ఇందులో కొంత భాగాన్ని చెంచులు, గుడికట్టు, తప్పెట, అటవీ అధికారులు, బోయిలూ, రెడ్డి, కరణం, అర్చకులు, నిషాని తదితరులకు అందజేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవపల్లకీలో ఉత్సవమూర్తులను కొలువుంచారు. భక్తుల గోవిందా నామస్మరణతో ఉత్సవ పల్లకి ఆలయం వెలుపలకు వస్తున్న సమయంలో చెంచులు పల్లకీపై విల్లంభులు ఎక్కుపెట్టి సంధించారు. తమ ఆడబిడ్డ అయిన చెంచులక్ష్మీ అమ్మవారిని స్వామి వివాహం చేసుకునేందుకు భక్తులను ఆహ్వానించేదుకు గ్రామాలకు వెళ్తున్నందుకు సంతోషంగా విల్లంభులు వదులుతూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం చెంచులు పల్లకీ ముందు సంప్రదాయ నృత్యాలు చేస్తూ గ్రామ పొలిమేర వరకు సాగనంపారు. కార్యక్రమాలను ప్రధానార్చకులు వేణుగోపాలన్, మణియార్ సౌమ్యానారయన్ పర్యవేక్షించారు.

భక్తజనంతో పులకించిన అహోబిలం

- దిగువ అహోబిలం చేరుకున్న జ్వాలా నృసింహస్వామి
- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన వేదపండితులు
- బావను సాగనంపేందుకు చెంచుల ఏర్పాట్లు



పల్లకీని అలకంరించేందుకు సరంజామను ఊరేగింపుగా తీసుకొస్తున్న చెంచులు



జ్వాలా నరసింహ స్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న వేదపండితులు

పార్వేటోత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా స్వామి వార్ల ఉత్సమూర్తులను సాగనంపేందుకు భక్తులు అహోబిల క్షేత్రానికి భారీగా తరలివచ్చారు. గోవింద నామస్మరణతో నల్లమల గిరులు మారుమోగాయి. శ్రీ అహోబిల లక్ష్మీనృసింహ స్వామి పారువేట ఉత్సవాల్లో భాగంగా దిగువ అహోబిలం క్షేత్రంలో కొలువైన శ్రీ ప్రహ్లాదవరద స్వామితో కలిసి గ్రామ గ్రామాన సంచరిస్తూ విశేష పూజలందుకుంటూ, భక్తులకు దివ్యదర్శన భాగ్యం కల్పిస్తూ.. తమ వివాహ మహోత్సవ వేడుకలుకు రావాలంటూ ఆహ్వానం పలికేందుకు ఎగువ అహోబిలంలో వెలసిన ఉత్సవమూర్తి శ్రీజ్వాలానృసింహ స్వామి మంగళవారం దిగువ అహోబిలం చేరుకున్నారు. ఎగువ అహోబిల దేవాలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవారిని కొలువుంచి అర్చన, అభిషేకాలు, తిరుమంజనం నిర్వహించిన అనంతరం విశేషంగా అలంకరించి కొలువుంచారు. అనంతరం శ్రీజ్వాలానృసింహ స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవ పల్లకీలో కొలువుంచి నల్లమల అడవి మార్గంలో దిగువ అహోబిలం తోడ్కొనివచ్చారు. స్వామి దిగువ అహోబిలం చేరుకుంటున్న సమయంలో ఆలయ అర్చకులు, వేద పండితులు మఠం ప్రథమ పీఠాధిపతి ఉత్సవ పల్లకీతో గ్రామ పొలిమేర వరకు భాజా భజంత్రీలతో ఎదురేగి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

సంప్రదాయానికే పెద్దపీట..

తమ ఇంటి ఆడపడుచు చెంచులక్ష్మి అమ్మవారిని వివాహమాడిన అహోబిలేశుడు తమకు (చెంచులకు) బావ అవుతాడని పురాణ సారాంశం. అందుకే తమ బావ నరసింహస్వామి, సోదరి చెంచులక్ష్మి అమ్మవార్ల వివాహ వేడుకలకు 46 రోజులు 33 గ్రామాల్లోని భక్తులను ఆహ్వానించేందుకు బయలుదేరి వెళ్తున్న సందర్భంగా శ్రీ జ్వాలా నృసింహస్వామి, శ్రీప్రహ్లాదవరద స్వాములను ఉత్సవ పల్లకీలో సాగనంపడం ఆనవాయితీ. ఇందుకు పల్లకీని ముస్తాబు చేసేందుకు అవసరమైన వస్తువులను, అహోబిలం చెంచు కుటుంబాలు అడవి నుంచి తీసుకొచ్చి దేవాలయాన్ని, ఉత్సవ పల్లకీని అలంకరించడం సంప్రదాయం. దీనికోసం చెంచులు మూడు రోజులుగా నియమ నిష్టలతో దీక్ష చేపట్టి అడవికి వెళ్లి తెచ్చిన మామిడాకులు, కర్రలు, యేపె నారను తమ గూడెం నుంచి డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి ఉత్సవ పల్లకీని తయారు చేశారు.

రమణీయం..రథోత్సవం



రథంపై కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో సంజీవనగర్ రామాలయం, శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం రథోత్సవ వేడుకలు నిర్వహించారు. 50 ఏళ్ల తరువాత రథోత్సవ కార్యక్రమాన్ని పునరుద్ధరించారు. ఉదయం ముందుగా రథాన్ని సుందరంగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను రథంపై అధిష్టింపజేసి దేవాలయ ఆవరణ నుంచి బయల్దేరింది. రథోత్సవంతో పట్టణంలో రోడ్లన్నీ భక్తులతో నిండిపోయాయి. గోవింద నామంతో నంద్యాల పట్టణం మారుమోగింది. ఈ సందర్భంగా రథం ముందు చెక్క భజనలు, కోలాటాలు, స్వామి, అమ్మవార్ల వేష ధారణలు, కీలుగుర్రాలు, పొడుగు కాళ్ల మనుషులు, మహిళల అన్నమయ్య కీర్తనలతో వేడుక కొనసాగింది. మార్గమధ్యలో భక్తులు కాయ, కర్పూరం ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సంజీవనగర్ శ్రీనివాసనగర్, నాగులకుంట రోడ్డు, గాంధీచౌక్ చేరుకొని అక్కడి నుంచి ఆలయానికి చేరుకున్నారు. డీఎస్పీ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



గ్రామోత్సవంలో నృత్యాలు చేస్తున్న కళాకారిణులు



శ్రీవేణుగోపాలస్వామిని పల్లకీలో ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం



ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళకు గ్యాస్‌స్టవ్ అందజేస్తున్న దృశ్యం



ఉయ్యాలవాడలో సీతారాముల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



బహుమతులను అందజేస్తున్న సీఐ వంశీధర్,ఎస్ఐ చిన్నపీరయ్య

ముగిసిన సంక్రాంతి సంబరాలు





గొడిగనూరులో పట్టాభి సీతారామస్వాముల వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు,మల్లెవేములలో శ్రీచెన్నకేశవస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



రుద్రవరంలో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



యాళ్లూరులో శ్రీ ఉమా సమేత నీలకంఠేశ్వర స్వామి, శ్రీ లక్ష్మి మాధవ స్వామి ఊరేగింపు

గోస్పాడు: మండలంలోని గ్రామాల్లో వైభవంగా సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. సాంబవరం గ్రామంలో మంగళవారం శ్రీ మాధవ స్వామి, బుధవారం యాళ్లూరులో శ్రీ ఉమా సమేత నీలకంఠేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ మాధవ స్వామి, జిల్లెల్లలో శ్రీచెన్నకేశవస్వామిని, ఎం.చింతకుంట్ల గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వామి, ఎం.కృష్ణాపురం గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అలాగే గోస్పాడులో శివుడు, పార్వతి, గంగా, రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాల, సీతారామ ఆంజనేయస్వాముల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం చేపట్టారు.

నంద్యాల(అర్బన్) : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని మిట్నాల గ్రామంలో మంగళవారం గ్రామానికి చెందిన కొట్టాలరవి, నందీశ్వరరెడ్డి, నూర్‌హుసేన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు.

ఉయ్యాలవాడ : మండలంలోని గ్రామ పంచాయతీల్లో సంక్రాంతి సంబరాలు కనుమ పండుగతో బుధవారం ముగిశాయి. చివరి రోజు మండల కేంద్రం, తుడుమలదిన్నె, బోడెమ్మనూరు, మాయలూరు, అల్లూరు, సుద్దమల్ల, ఆర్‌పాంపల్లె, హరివరం, కాకరవాడ, ఆర్. జంబులదిన్నె, తదితర గ్రామాల్లో కనుమ పండుగ పురస్కరించుకుని పారువేట ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. సీతారాములు, శివపార్వతులు, కోదండ రామస్వామి ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి గ్రామోత్సవం చేపట్టారు. పరుగు పందెం పోటీల్లో విజేతగా నిలిచిన సురేష్‌కు ప్రోత్సాహ బహుమతి అందజేశారు.

రుద్రవరం: మండలంలో సంక్రాంతి పండుగను ప్రజలు మూడురోజుల పాటు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గ్రామాల్లో దేవుళ్లకు పార్వేటోత్సవం, యువతీ, యువకులకు క్రీడాపోటీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని భాస్కర నందీశ్వరస్వామి,సత్యనారాయణ స్వామి,చిన్నకంబ లూరులో చెన్నకేశవస్వామి వారికి పార్వేట ఉత్సవం నిర్వహించారు.పెద్దకంబలూరులో ముగ్గుల పోటీలు, చిన్న కంబలూరులో యువతకు కబడ్డీ, రుద్రవరంలో పరుగు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

దొర్నిపాడు: మండలంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా ముగిశాయి.రామచంద్రపురం గ్రామంలో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల కోలాటం అలరించింది. తెప్పోత్సవం అనంతరం వివిధ పోటీల్లో గెలిపొందిన వారికి బహుమతులు అందజేశారు.

చాగలమర్రి: మండలంలోని మల్లెవేముల గ్రామంలో మంగళవారం వైఎస్సార్‌జిల్లా రాజుపాళెం మండలం, వెల్లాల గ్రామంలోని సంజీవరాయస్వామి ఆలయంలో వెలసిన వెల్లాలా చెన్నకేశవస్వామి, శ్రీదేవి,భూదేవి సమేత, శివ,గంగా,పార్వతుల ఉత్సవ మూర్తుల పార్వేట మల్లెవేముల గ్రామానికి విచ్చేయటంతో గ్రామంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ముత్యాలపాడులో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బుధవారం గ్రామంలో వెలసిన మూర్తి శ్రీమూర్తి లక్ష్మీనరసింహస్వామి, చెంచులక్ష్మీ, లక్ష్మీదేవి, గరుత్మంతుడి ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహించారు. గొడిగనూరు, చిన్నబోధనం గ్రామాల్లో శ్రీపట్టాభిసీతారామస్వామి, శ్రీలక్ష్మీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో బుధవారం గ్రామోత్సవం, పార్వేట కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. శ్రీపట్టాభి సీతారామస్వాముల వారి ఉత్సవ మూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే పారువేట కార్యక్రమంలో భాగంగా గొర్రెను వదలగా గ్రామానికి చెందిన యువకులు దానిని పట్టుకునేందుకు ఉత్సాహంగా పరుగులు తీశారు. చిన్నబోధనం గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీప్రసన్న వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం జరిపించారు.

శిరివెళ్ల: సంక్రాంతి సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో షటిల్ పోటీలు జరిగాయి. యర్రగుంట్లకు చెందిన చల్లా సంజీవ, ఆల మధుసుధాకర్ ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలకు సీఐ వంశీధర్, ఎస్ఐ చిన్న పీరయ్య బహుమతులు అందజేశారు.



చిన్నకంబలూరులో కబడ్డీ ఆడుతున్న యువకులు

ప్రకృతి దీపం వెలుగులు!



దొర్నిపాడు పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం సాయంం సంధ్య సమయంలో చందమామ కాంతులు



క్రిష్టిపాడులో బుధవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో మేఘాల మధ్య వెలుగులీనుతున్న జాబిలి

అది సూర్యుడు అస్తమించే సమయం.. చీకట్లు పరుచుకుండగా.. నిండు చంద్రుడు అరుణ వర్ణం ఆకాశంలో తన లేలేత బంగారు కిరణాలతో వెలుగులను విరజిమ్ముతున్న దృశ్యం ప్రకృతి ప్రేమికులను అలరించింది. కాగా ఇదే సమయంలో వెలిగి విద్యుత్ దీపాలు చందమామ ముందు తేలిపోయాయి. ఈ దృశ్యం దొర్నిపాడు పోలీస్ స్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి కనువిందు చేసింది. కృత్రిమ దీపాల్లో ప్రకృతి దీపంలా మూడు నక్షత్రాల మధ్య చందమామ ఇలా అకట్టుకున్నాడు. -దొర్నిపాడు